రోబోటిక్స్‌తో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స

మాట్లాడుతున్న డాక్టర్ రవిచంద్ర

ఖైరతాబాద్, ఏప్రిల్ 15:రోబోటిక్స్ విధానంతో దేశంలోనే మొట్టమొదటి మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని కేర్ ఆస్పత్రి కన్సల్టెంట్ రోటోటిక్ మోకాలు మార్పిడి సర్జన్ డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి తెలిపారు. మంగళవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను సంప్రదాయ పద్ధతుల్లో చేస్తే 18 నెలల కాలంలో పలుమార్లు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుందని, రోబోటిక్ విధానంలో అయితే ఒక్కసారి చేస్తే సరిపోతుందని, రోగి వెంటనే కోలుకుంటాడని తెలిపారు. ఆధునాతన వెలిస్ రోబోటిక్ విధానంతో ఈ శస్త్రచికిత్స నిర్వహిస్తున్నామన్నారు.

యూసుఫ్‌గూడ నిమ్స్ మేలో ఉద్యోగమేళా

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో బుధవారం యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మే క్యాంపస్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్న నిరుద్యోగ యువతకు వృత్తి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఎంఎస్ఎం ఈ మంత్రిత్వ శాఖ, అసిస్టెన్స్ టూ ట్రైనింగ్ ఇనిస్టిట్యూషన్స్(ఏటీఐ)పథకం కింద ఉద్యమిత్వ, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల(ఈఎస్‌డీపీఎస్)లో భాగంగా ఈ ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు నైపు ణ్య శిక్షణ ఇన్‌చార్జి వి.స్వప్న ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో దేశంలోని 22 ప్రముఖ కంపెనీలు పాల్గొని నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఎస్‌క్యూఎఫ్) ప్రమాణాలకు అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వనున్నారు. ఇందులో సమాచార సాంకేతికం(ఐటీ), ఐటీ ఎనేబుల్డ్ సర్వీసులు(ఐటీఈఎస్), బ్యూటీఅండ్ వెల్‌నెస్, ఫుడ్ ప్రాసెసింగ్, అప్పారెల్ అండ్ టెక్స్టైల్ రంగం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ), మీడియా అండ్ ఎంటర్‌టైన్మెంట్ రంగాల కంపెనీలు పాల్గొంటారని తెలిపారు. నిరుద్యోగ యువత బయోడేటా, సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు వి.స్వప్న, నైపుణ్య శిక్షణ ఇన్‌చార్జి, ఫోన్:040-236332 18/ 61,ఈమెయిల్: swapna@nimsme.gov.inలో సంప్రదించాన్నారు.

డబుల్ ఇండ్లకు చేరకుంటే రద్దు!

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో లబ్ధిదారులకు రెండుసార్లు నోటీసులు జారీ
- మరోసారి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామంటున్న అధికారులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బండ్లగూడలోని డబుల్ బెడ్రూమ్ ఇండ్లు

మేడ్చల్, ఏప్రిల్15(నమస్తే తెలంగాణ): కేటాయించిన డబుల్‌బెడ్ రూమ్‌లలో లబ్ధిదారులు చేరకుంటే రద్దుకు చర్యలు తీసుకోనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉన్న డబుల్‌బెడ్ రూమ్‌ల లబ్ధిదారులకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. ఈనెల 20లోపు మరోసారి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్‌లను ఇండ్లు లేని వారిని గుర్తించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేటర్ పరిధిలోని వారికి అందించింది. జిల్లాలోని బండ్లగూడ, రాంపల్లి, జవహర్‌నగర్ పరిధిలోని ఆహ్మద్‌గూడ, తూంకుంట, శామీర్‌పేట్ మండలం మురహరిపల్లి, ప్రతాపసింగారం, కొర్రెముల, దుండిగల్‌లో వేలాది సంఖ్యలో డబుల్‌బెడ్ రూమ్‌లను నిర్మించి అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయిస్తూ సర్టిఫికెట్లు అందించారు.

ఖాళీగా వేలాది ఇండ్లు ..

లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించినా వేలాది సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో 6,203 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించగా.. 1500 మంది లబ్ధిదారులు మాత్రమే చేరగా, మరో 4,500 ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో ఇక్కడే ఖాళీగా ఉన్నాయి. ప్రతాపసింగారంలో 2వేల మంది లబ్ధిదారులకు..1100 మంది లబ్ధిదారులు మాత్రమే చేరారు. మరో 900 ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. తూంకుంట మండలం మురహరిపల్లిలో 2,200 మంది, దుండిగల్‌లో 396 మంది, కొర్రెములలో 30 మంది లబ్ధిదారులు డబుల్‌బెడ్ రూమ్‌లలో చేరాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తలుపులు, కిటికిలు విరిగిపోతున్నాయని, దీంతో ఇబ్బందులు వస్తున్న క్రమంలో ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్‌లను ఖాళీగా ఉంచకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రజాపాలనలో ఇండ్ల కోసం అనేక దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో డబుల్ ఇండ్లలో చేరిని వారి గుర్తింపును రద్దు చేసి ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారికి అందించేల చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రద్దు చేస్తామని నోటీసు బోర్డు

జీహెచ్ంఎసీ ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

జీహెచ్ఎంసీ డబుల్‌బెడ్ రూమ్ లబ్ధిదారులకు మంజూరు చేసిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ఈనెల 20వ తేదీ లోపు వచ్చి నివసించకుంటే మీకు ఇల్లు అవసరం లేదని భాంచి రద్దు చేయుటకు అధికారులకు సిఫారసు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ బోర్డును ఏర్పాటు చేసింది.

మల్లారెడ్డి యూనివర్సిటీలో టీజీఈఏపీసెట్ ఆన్‌లైన్ మాక్ టెస్ట్

సిటీబ్యూరో, ఏప్రిల్15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీఈఏపీసెట్) దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల కోసం మల్లా రెడ్డి యూనివర్సిటీ ఆన్‌లైన్ మాక్ టెస్ట్-2025ను నిర్వహిస్తుందని మల్లారెడ్డి విద్యా సంస్థల చైర్మన్, ఫౌండర్ చామకూర మల్లారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 20న నిర్వహించే ఈ టెస్టుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అదేవిధంగా విద్యార్థుల విద్యలో ప్రోత్సహిస్తూ, మల్లారెడ్డి యూనివర్సిటీ 500 మెరిట్ ఆధారిత అడ్మిషన్లకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను ప్రకటించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి, వారికి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ వీఎస్.కె.రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్‌లో ప్లేస్మెంట్ డ్రైవ్.. 13 మందికి ఉద్యోగాలు

జేఎన్టీయూహెచ్ వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్ లో యూనివర్సిటీ కళాశాల కెమిస్ట్రీ విభాగానికి చెందిన 13 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. మంగళవారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జీ.వీ. నరసింహ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, కెమిస్ట్రీ విభాగం అధిపతి సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 15

సీఎం కార్యాలయంలో ఒక్క బీసీ లేదు

- కీలక పదవులన్నీ అగ్రవర్ణాల చేతిలోనే..
- కార్పొరేషన్లలో సైతం 85 శాతం పోస్టులు వాళ్లకే
- రాష్ట్రంలో సామాజిక న్యాయం లేదు
- ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి
- మీడియా సమావేశంలో జస్టిస్ ఈశ్వరయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

ఖైరతాబాద్, ఏప్రిల్ 15 : రాష్ట్రంలో కీలక పదవులన్నీ సీఎం సామాజికవర్గంతో పాటు ఇతర అగ్రవర్ణాలకే కట్టబెట్టారని వక్తలు ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశాంత్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఫోరం వ్యవస్థాపకులు చిరంజీవులు తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఏ రంగంలోనూ సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కేంద్ర సచివాలయంలో అఖిల భారత సర్వీస్ ఉద్యోగుల్లో 90 మంది అగ్రవర్ణాలు, ముగ్గురు మాత్రమే బీసీలు ఉన్నారని ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పదే పదే విమర్శిస్తూ ఉంటారని, ముందు తెలంగాణ విషయం తేల్చాలన్నారు. సీఎం కార్యాలయంలో ఒక్క బీసీ లేకపోవడం విచారకరమని, అన్ని ప్రధానమైన శాఖలన్నీ తన చేతుల్లోనే పెట్టుకున్నాడని, మరో ముగ్గురు ఆయన సామాజికవర్గానికి చెందిన వారికి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. దీనిపై సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్ పోస్టులు సైతం అగ్రవర్ణాలకే అత్యధికంగా దక్కాయన్నారు. 15 శాతం ఉన్న వారికి 51 పదవులు, 85 శాతం ఉన్నవారికి 23 పదవులు మాత్రమే ఇచ్చారన్నారు. మేజర్ పాలన అగ్రవర్ణాల కబంధ హస్తాల్లో ఉందన్నారు. బీసీల కోసం 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, బీసీ సమాజం, సంఘాల ఒత్తిడి వల్లనే దిగొచ్చిందని మర్చిపోవద్దన్నారు. తమిళనాడులో రిజర్వేషన్లు అమలు చేయించుకోవడం కోసం నాడు అనేక మార్లు ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి చివరికి 9వ షెడ్యూల్‌లో చేర్చేలా ఒత్తిడి చేసి విజయం సాధించిందన్నారు. తీర్మానం చేశాం కదా అని చేతులు దులుపుకుంటే సరిపోదని, సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి, తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ, యువజన జేఏసీ చైర్మన్ అశోక్, ఓబీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ అవ్వారు వేణు కుమార్, కిరణ్ కుమార్, శ్రావణ్‌కుమార్, పిడికిలి రాజు, కేవీ గౌడ్, మహిళా నాయకురాలు ఉపేంద్ర, ఉస్మానియా విద్యార్థి జేఏసీ నాయకులు వీరమల్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సైకిళ్లకు హెచ్‌సీజీ దరఖాస్తుల ఆహ్వానం

సర్కార్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులకే అవకాశం

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): ప్రతి ఏటా వంద సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్న హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్(హెచ్‌సీజీ) ఈ ఏడాది కూడా సైకిళ్ల పంపిణీకి సిద్ధమైంది. ఈ ఏడాది ఇప్పటికే 15 సైకిళ్లకు పైగా ఉచితంగా అందించింది. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులకు మాత్రమే ఉచితంగా సైకిళ్లను అందిస్తున్నట్టు హెచ్‌సీజీ ఫౌండర్ నందనూరి రవీందర్ తెలిపారు. జూన్ 3వ తేదీన జరిగే 'వరల్డ్ సైక్లింగ్ డే' సందర్భంగా ఉద్యోగాలకు ఇప్పటికీ సైకిళ్లపైనే వెళ్లే వారిని గుర్తించి సత్కరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. పర్యావరణ ముప్పు పెరుగుతున్న పరిస్థితుల్లో వాహన కాలుష్యం తగ్గించేలా పర్యావరణ ప్రేమికులు సైకిళ్లనే వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. నగరంలో సైక్లింగ్ వినియోగం పెంచేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, సైకిళ్ల అవసరం ఉన్న విద్యార్థినులు 98854 40308 నంబర్‌కు వివరాలను వాట్సాప్ చేయాలని సూచించారు. తమ టీమ్ ఆ వివరాలను పరిశీలించి అర్హత గల వారికి సైకిళ్లను అందిస్తుందన్నారు.

మన బియ్యం ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 15 : తెలంగాణ రాష్ట్రం నుంచి తొలిసారి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి అవుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'బియ్యం ఎగుమతి విధానం' అనే అంశంపై దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బియ్యం ఎగుమతి విధానంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రిహబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయిందని,ధాన్యం మార్కెట్ అన్వేషన్‌లో భాగంగా ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని ఫిలిప్పైన్స్‌కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు ఆ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని చెప్పారు.ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, అఖిలభారత రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణారావు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, ఆపేడా అధికారులు, రైతు నాయకులు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, పౌరసరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకు డాక్టర్ బలరాం, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్‌రాజు, వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత,యూజీసీ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ డాక్టర్ సమరెండు మహంతి ఎగుమతుల విధానంపై మాట్లాడారు.

గాలివానలతో అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, ఏప్రిల్15(నమస్తే తెలంగాణ):వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, బాగా ఎండకాసే వేళ కొన్ని సర్కిళ్లలో ఒక్కసారిగా వర్షం కురుస్తున్నదని, కొన్నిచోట్ల గాలి ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నందున అధికారులు, సిబ్బందంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. మంగళవారం ముఖ్య అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ముషారఫ్ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై ఆరా తీశారు. గాలులతో సెంట్రల్, బంజారా హిల్స్, సౌత్ సర్కిల్ పరిధిలో అక్కడక్కడ సరఫరాలో అంతరాయం ఏర్పడగా.. సిబ్బంది సరి చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ముషారఫ్ మాట్లాడుతూ.. అకాలవర్షం, గాలి ప్రభావం విద్యుత్ వ్యవస్థపై ప్రభావం ఉంటుందని, చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈలు వాతావరణ శాఖ చేసే బులెటిన్‌ను ఫాలో అవుతూ క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని, పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండొద్దని చెప్పారు.

కంటిపై గుచ్చుకున్న స్క్రూడ్రైవర్.. గాంధీలో తొలగింపు

బాధితుడు రంజిత్

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 15: ఓ యువకుడి కంటి పై భాగంలో దిగిన స్క్రూడ్రైవర్‌ను గాంధీ దవాఖాన వైద్యులు తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి తెలిపిన ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన రంజిత్(21) ఎలక్ట్రికల్ మెకానిక్. అయితే అతడు ఈనెల 8వ తేదీన మెకానిక్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు స్క్రూడ్రైవర్ కుడి కంటి పైభాగంలో దిగింది. అదేరోజు చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు కంటి ఆస్పత్రిలో చేరగా.. అక్కడి వైద్యులు 9వ తేదీన నిమ్స్‌కు వెళ్లాలని సూచించారు. నిమ్స్‌లో పరిశీలించిన వైద్యులు 10న గాంధీ దవాఖానకు సిఫారసు చేశారు. దీంతో గాంధీ నేత్ర వైద్య విభాగం వైద్యులు అతడికి పరీక్షలు నిర్వహించి కంటికి ఎటువంటి గాయం కాలేదని, కంటి పైభాగంలో స్క్రూడ్రైవర్ గుచ్చుకుందని నిర్ధారించారు. న్యూరో సర్జరీ విభాగం వైద్యులు సుమారు రెండు గంటలపాటు శ్రమించి అరుదైన ఆపరేషన్ చేసి స్క్రూడ్రైవర్‌ను విజయవంతంగా తొలగించారు. సర్జరీ అనంతరం రోగి కోలుకుంటున్నాడని, ఆరోగ్యం నిలకడగా ఉన్నదని ఆమె తెలిపారు. న్యూరో సర్జరీ వైద్యులను ఆమె అభినందించారు.

దూరవిద్య పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు సూచనలిస్తున్న డీఆర్ఓ వెంకటాచారి

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఓపెన్ పది , ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్య, రెవెన్యూ, పోలీస్, వైద్య, పోస్టల్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 73 సెంటర్లలో మొత్తం15,068 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లు, చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించామన్నారు. 7 రూట్లలో రూట్ అధికారులను కేటాయించామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. హైదరాబాద్ లో ట్రాఫిక్ దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈఓ ఆర్. రోహిణి, అదనపు డీసీపీ రామదాసు తేజావత్, మెడికల్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే ముఖ్యం..

ఘనంగా స్త్రీ సమ్మిట్ 2.0

స్త్రీ సమ్మిట్‌లో మాట్లాడుతున్న హెచ్‌సీఎస్‌సీ చైర్మన్ , సీపీ సీవి ఆనంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత, మహిళా సాధికారతే లక్ష్యంగా హైదరాబాద్ సిటీపోలీస్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్త్రీస మ్మిట్-2.0 ఘనంగా జరిగింది. తాజ్‌డెక్కన్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, సిటీపోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్, హెచ్‌సీఎస్‌సీ చైర్మన్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశంలో బాలికల నిష్పత్తి తగ్గుతున్నదని, ఇది దేశప్రగతికి కొంత అవరోధంగా మారుతుందన్నారు. ప్రతీ ఇంట్లో, పనిచేసేచోట మహిళలపై వివక్షత పోవాలని పిలుపునిచ్చారు. నీతిఆయోగ్ లా డివిజన్ సీనియర్ స్పెషలిస్ట్ డా.భానుశ్రీవేల్‌పాండ్యన్ మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం నీతి ఆయోగ్ తన విభాగాలతో పాటు ఇతర శాఖలను కూడా ప్రభావితం చేస్తున్నదన్నారు. ఈ సదస్సులో 5 సెషన్లలో మహిళల భద్రత, చిన్న పిల్లల రక్షణ, సైబర్ సెక్యూరిటీ, అర్బన్ ఎన్విరాన్‌మెంట్, ఎమర్జెన్సీ ప్రిపేర్డ్‌నెస్ వంటి అంశాలపై చర్చ జరిగింది. విభిన్నరంగాలకు చెందిన మహిళలు, యువతులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సమ్మిట్‌లో భాగంగా విమెన్ సేఫ్టీవింగ్ డీసీపీ డా.లావణ్య చిన్నారులపై లైంగిక వేధింపులు తదితర వివరాలను తెలిపేలా ప్రజెంటేషన్ ఇచ్చారు. సెషన్ల సంయోజకులుగా నీహారిక మాల్‌పూర్, ఉమాసుధీర్, చేతనాజైన్, పూర్ణిమా కాంబ్లే, ఖ్యాతినిర్వాణె,గీతాగోటి, చారు వాలిఖన్నాలు వ్యవహరించారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారులు దివ్యదేవరాజన్, వనిత దాట్ల, జెన్నిఫర్ లార్సన్, నిర్మలాకాంతి వెస్లీ, జాయింట్ సీపీ పరిమళహననూతన్, హెచ్‌సీఎస్‌సీ జనరల్ సెక్రటరీ సి.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలమండలి మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్

తొలి రోజే 64 మోటార్లు స్వాధీనం, 84 మందికి జరిమానా

సిటీబ్యూరో, ఏప్రిల్15, (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో అనుమతులకు విరుద్ధంగా మోటార్ వాడకం అరికట్టడానికి, నీటి వృథాను నివారించడానికి జలమండలి మంగళవారం 'మోటార్ ఫ్రీ టాప్' డ్రైవ్‌ను ప్రారంభించింది. మొదటి రోజే 64 మోటార్లను సీజ్ చేయగా.. 84 మంది వినియోగదారులకు అక్రమంగా మోటార్లు ఉపయోగించి, నీటి వృథా చేసినందుకు జరిమానా విధించారు. అత్యధికంగా ఓ అండ్ ఎం డివిజన్ లో 6, ఎస్ఆర్ నగర్ పరిధిలో 25 మోటార్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్ల ద్వారా మహానగరానికి తాగునీరు సరఫరా అవుతుంది. జలమండలి పర్యవేక్షణ లేమితో కొందరు వినియోగదారులు తమ నల్లాలకు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని తోడేస్తున్నారు. దీని కారణంగా మిగతా సామాన్యులకు తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అవుతున్నది. ఆలస్యంగా గ్రహించిన జలమండలి వారిపై చర్యలకు పూనుకున్నది. వినియోగదారులు తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే, నిబంధనల ప్రకారం.. జరిమానాతోపాటు మోటార్లు స్వాధీనం చేసుకుంటున్నారు. ఒకటికి రెండుసార్లు పట్టుబడితే కేసులు సైతం నమోదు చేయనున్నారు. నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలెదురైనా జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

సీజ్ చేసిన మోటార్లతో జలమండలి అధికారులు

జోస్ అలుక్కాస్ ఆత్మకథ గోల్డ్

- పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి సురేష్‌గోపీ
- త్రిసూర్ స్వర్ణ వారసత్వాన్ని తీర్చిదిద్దిన జోస్
- త్రిసూర్‌లో వేడుకగా పుస్తకావిష్కరణ

జోస్‌అలుక్కాస్ ఆత్మకథ గోల్డ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్రమంత్రి సురేశ్‌గోపీ తదితరులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): కేరళలోని త్రిసూర్ యొక్క కాలాతీత స్వర్ణ వారసత్వాన్ని నిర్మిస్తూనే భారతదేశ బంగారు మార్కెట్‌కు నిర్మాణం, నమ్మకాన్ని తీసుకొచ్చిన మార్గదర్శక వ్యవస్థాపకుడు జోస్ అలుక్కాస్ అని కేంద్ర మంత్రి సురేశ్ గోపి, ఆ రాష్ట్ర మంత్ర